సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

మలక్‌పేట: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం ప్రతినిధులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని నగరంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల పున: ప్రారంభానికే ముందే బదిలీలు పూర్తి చేసి ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలు పూర్తి తర్వాతే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలని, గ్రేడ్ -2 ప్రిన్సిపాల్ పోస్టులు మొత్తం ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీజీటీ జూనియర్ లెక్చరర్ పోస్టులను 70 శాతం ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రసూతి సెలవులో వెళ్లే మహిళా ఉపాధ్యాయులకు ప్రతినెలా వేతనం చెల్లించాలన్నారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సంఘం అధ్యక్షుడు ఆవుల సైదులు, ప్రధాన కార్యదర్శి పోలు జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, ఉపాధ్యక్షులు తాడూరి అరుణ్‌కుమార్, ఆవ మల్లయ్య, వై. సంతోష్, సంయుక్త కార్యదర్శి జల్లాపురం చిన్నస్వామి, కోశాధికారి కృష్ణారెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలల దోపిడీని అరికట్టాలి



రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మలక్‌పేట: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల దోపిడిని అరికట్టాలని స్వేరో స్టూడెంట్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిపాక నవీన్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి శుక్రవారం వినతికి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యేటా మేనేజ్‌మెంట్ కోట సీట్లు 'బీ' కేటగిరిలో కేటాయించిన అడ్మిషన్లను కాలేజీ యాజమాన్యాలు ముందస్తుగా సీట్లను బ్లాక్ చేయించి వాటిని కూడా లక్షల్లో పేరెంట్స్ నుంచి వసూలు చేస్తున్నారని, దీనిపై ప్రశ్నించేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బీ కేటగిరి సీట్లను కూడా కౌన్సిలింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉన్నా.. యాజమాన్యాలు కౌన్సిలింగ్ చేపట్టకుండా సొమ్ము చేసుకుంటున్నాయని, దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం సత్వరమే స్పందించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సిద్దార్థ, దారమల్ల ప్రకాశ్, అందే అజయ్, సాగర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి పోస్టర్ విడుదల



హనుమాన్ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నాగోలు: కొత్తపేటలో హనుమాన్ యువసేన అధ్యక్షుడు యశ్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా బీజేపీ కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్నం పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. మహిళా సంఘాలు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు. కార్యక్రమంలో యువసేన నాయకులు కిరణ్‌కుమార్, వినోద్ కుమార్, వెంకటేశ్, సంప్రీత, అశోక్ తరుణ్, యశ్వంత్, విష్ణు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: వర్షాకాలంలోగా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని ఓల్డ్ కొత్తపేట బస్తీ నుంచి గురుమందిర్ వరకు జరుగుతున్న నూతన డ్రైనేజీ పనులను వాటర్‌వర్క్స్ జీఎం బలరాంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు ప్యాచ్ వర్కు పనులు కూడా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు గోపాల్ యాదవ్, కృష్ణయాదవ్, రాజు, నాయకులు అశ్విన్‌సింగ్ తిరుమల, వెంకటరెడ్డి, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



క్యాంపు కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శుక్రవారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, డివిజన్లలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జూన్ 2వ తేదీన జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ముగింపు వేడుకలలో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు సన్మానం చేస్తామన్నారు. కలసికట్టుగా వేడుకలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మీర్‌పేట, బడంగ్‌పేట అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, నాయకులు సాజీద్, గోపాల్, ప్రభాకర్, సునీత, లావణ్య, లలితజగన్, ప్రవీణ్‌రెడ్డి, బాలరాజు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నో పేమెంట్..నో వర్క్స్

చేసిన పనులకు బిల్లులు రావడం లేదని జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కొత్తపేటలోని జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయం ఎదుట 'నో పేమెంట్..నో వర్క్స్' అంటూ బ్యానర్ ఏర్పాటు చేశారు. తమ బిల్లులు వచ్చే వరకు పనులు చేసేది లేదని, అయితే పన్నులు కట్టే ప్రజలకు అసౌకర్యం కలుగుతున్నందుకు సారీ అంటూ బ్యానర్‌లో పేర్కొన్నారు. –చైతన్యపురి



స్కూళ్ల ప్రారంభానికే యూనిఫాంలు..!

- మహిళా సంఘాలకు కుట్టే బాధ్యత
- ముమ్మరంగా సాగుతున్న స్టిచ్చింగ్ పనులు
- మలక్‌పేట జోన్ పరిధిలో 22,828 మంది విద్యార్థులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు



విద్యార్థుల స్కూల్ యూనిఫాంలు కుడుతున్న మహిళా సంఘాల సభ్యులు

చాదర్‌ఘాట్: ప్రభుత్వ పాఠశాలల పున:ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే మలక్‌పేట, సైదాబాద్, అంబర్‌పేట మండలాల పరిధిలోని మహిళా సంఘాలకు వస్త్రం ఇచ్చి యూనిఫాంలు కుట్టించే పనులు అప్పగించగా ప్రస్తుతం కుట్టు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

- జూన్ 5వ తేదీ నాటికి దుస్తులు కుట్టి ఆయా పాఠశాలలకు పంపించాలని ఈ బాధ్యతలను జీహెచ్ఎంసీ యూసీడీ విభాగాం అధికారులకు అప్పగించారు.
- జీహెచ్ఎంసీ సర్కిల్–6 యూసీడీ డీపీవో యుగేంధర్‌రెడ్డి పర్యవేక్షణలో మహిళా సమాఖ్య సభ్యురాళ్లు గుర్తించిన సెట్విన్ కేంద్రాల్లో యూనిఫాంలు కుడుతున్నారు. గత ఐదు రోజులుగా స్టిచ్చింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.
- మలక్‌పేటలోని సైదాబాద్, అంబర్‌పేట మండలాల పరిధిలో నాలుగు చోట్ల మహిళా సంఘాల సభ్యులు వీటిని కుడుతుండగా, కుట్టుమిషన్లు ఉన్నవారు వస్త్రాన్ని తమ ఇంటికి తీసుకెళ్లి కుడుతున్నారు.
- ప్రతి విద్యార్థికి రెండు జతల ఏకరూప దుస్తులు ఇవ్వాలని నిర్ణయించారు.
- ఒక జత కుడితే రూ. 75 చెల్లిస్తున్నారు. మలక్‌పేట జోన్ పరిధిలో దాదాపు 22,828 మంది విద్యార్థుల కోసం వస్త్రాలు పంపిణీ చేశారు. యూసీడీ విభాగం అధికారుల ద్వారా మహిళా సంఘాలకు కుట్టే బాధ్యతను అప్పగించారు.

దుస్తులు ఇలా..

- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల (1–5 తరగతులు, 6,7వ తరగతులు) బాలురకు రెండు చొక్కాలు, రెండు నిక్కర్లు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండు ప్యాంట్లు, రెండు చొక్కాలు కుట్టిస్తున్నారు.
- బాలికలకు ప్రత్యేక దుస్తులు ఉన్నాయి. పంజాబీ డ్రెస్ మాదిరిగా పైన కోటు వచ్చేలా కుట్టిస్తున్నారు.



పర్యవేక్షిస్తున్న యూసీడీ డీపీవో యుగేంధర్‌రెడ్డి



దుస్తులను పరిశీలిస్తున్న డీపీవో

నిత్యం పర్యవేక్షిస్తున్నాం..

మలక్‌పేట పరిధిలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 30 వరకు ఉన్నాయి. సర్కిల్ పరిధిలో వంద మంది మహిళలు విద్యార్థుల యూనిఫాంలు కుడుతున్నారు. తొలిసారి మహిళా సమాఖ్యలకు ఏకరూప దుస్తులు కుట్టే అవకాశం లభించింది. కుట్టు పనులను నిత్యం పర్యవేక్షిస్తూ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

–యూసీడీ డీపీవో యుగేంధర్‌రెడ్డి

రిటైర్డు ఉద్యోగికి సత్కారం



రిటైర్డు ఉద్యోగి దంపతులను సత్కరిస్తున్న బీఆర్ఎస్ నేత

మన్సూరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో డ్రైవర్‌గా 36 ఏళ్లుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన రాంరెడ్డి– ధనమ్మను బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీశ్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మన్సూరాబాద్‌లో సత్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, మల్లారెడ్డి, గోపినాయక్, అశోక్‌రెడ్డి, కేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, చిన్నాయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నాగోలు: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని హిందూ అరణ్య ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు లభించలేదని, సుమారు 40–45 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సైదాబాద్‌లో మహిళ అదృశ్యం



వరలక్ష్మి

సైదాబాద్: మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డికాలనీలో నివసించే బి.వరలక్ష్మి (54)కి కొంతకాలంగా అనారోగ్యంతో పాటు మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. గురువారం ఇంటికి లాక్ చేసి ఇంటి ఓనర్‌కు తాళం చెవులు ఇచ్చి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు బావోజి లక్ష్మణ్ చారి ఇంటి చుట్టుపక్కల, బంధువుల ఇంటి గాలించినా ఆచూకీ లభించ లేదు. ఇంటి ఓనరు 2 నెలల అద్దె డబ్బులు అడిగినందుకు కోపంతో ఇల్లు వదిలి వెళ్లినట్లు ఆమె కుమారుడు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణ చేశారు. శివుడికి పూలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు చేసుకుంటున్న సీనియర్ సిటిజన్లు

మన్సూరాబాద్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్, గడ్డిఅన్నారం ఆధ్వర్యంలో ప్రగతినగర్‌కాలనీలోని ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 61మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ క్రిస్ ఆంటోనీ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ కార్తేశ్వరీ, అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరావు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జువైనల్ వెల్ఫేర్ కార్యాలయం తెలంగాణకు అప్పగింత



ఏపీ అధికారులను సన్మానించిన డాక్టర్ మీర్జా అలీ బేగ్

సైదాబాద్: ఏపీ, తెలంగాణలకు చెందిన జువైనల్ వెల్ఫేర్ ఉద్యోగుల సఖ్యత ఎప్పుడూ కొనసాగుతుందని తెలంగాణ జువైనల్ వెల్ఫేర్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ (జేడబ్ల్యూసీఎస్) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీ బేగ్ అన్నారు. విభజనలో భాగంగా సైదాబాద్‌లోని జేడబ్ల్యూసీఎస్ కార్యాలయంలోని ఏపీ జువైనల్ అధికారులు రెండవ అంతస్తులోని తమ కార్యాలయాన్ని తెలంగాణ అధికారులకు అప్పగించారు. శుక్రవారం కార్యాలయం అప్పగింత కార్యక్రమం ముగిసిన అనంతరం ఇరు రాష్ట్రాల అధికారుల సంభాషణలతో అక్కడ భావోద్వేగ వాతావరణం నెలకొంది. అధికారులు తాము కలిసి పనిచేసిన రోజుల జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం తెలంగాణ జువైనల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీ బేగ్ పలువురిని సన్మానించారు.

పార్కుపై పట్టింపేది..?

- అధ్వానంగా చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ పార్కు
- పడకేసిన పచ్చదనం, నీళ్లు పట్టక ఎండిపోయిన మొక్కలు
- ఆవరణంతా చెత్తమయం
- విరిగిపోయి ప్రమాదకరంగా మారిన ఆట పరికరాలు
- పట్టని అధికారులు



పార్కులో పేరుకుపోయిన మట్టికుప్ప

చైతన్యపురి: పార్కుల నిర్వహణను అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ఓ వక్క పచ్చదనం కోల్పోయి అందవిహీనంగా కనిపిస్తుండగా మరోవైపు పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇది చైతన్యపురి డివిజన్‌లోని ప్రభాత్‌నగర్ పార్కు దుస్థితి. దీంతో ఉదయం, సాయంత్రం ఉల్లాసంగా గడిపేందుకు కాలనీవాసులు పార్కుకు రావాలంటేనే జంకుతున్నారు.

- పచ్చదనంగా ఉండాల్సిన పార్కు ప్రాంతం చెత్త కుప్పలమయంగా మారింది.
- నడిచే దారి కూడా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో దర్శనమిస్తుంది.
- నిత్యం ప్రజలు సాయంకాలం తమ పిల్లలను తీసుకుని ఈ పార్కుకు వస్తుంటారు.
- పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు పాడైపోయి కనపిస్తున్నాయి.
- ఉయ్యాలకు చెందిన ఇనుప రాడ్డు విరిగి ప్రమాదకరంగా మారింది.
- పార్కులో ఉన్న కొద్ది మొక్కలకు కూడా సరిగా నీరు పట్టకపోవడంతో ఎండిపోయే పరిస్థితి నెలకొంది.
- కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు కూడా ఈ పార్కు అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.
- పార్కు ప్రహరీ బయట బిల్డింగ్ వ్యర్థాలు చాలా కాలంగా పేరుకుపోయి ఉన్నా తొలగించడం లేదు.
- పార్కులో పచ్చదనం పెంచి, ఆట పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నిర్వహణ లేక అధ్వానంగా ప్రభాత్‌నగర్ పార్కు



ఊయల రాడ్ విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం



ప్రహరీ పక్కన పేరుకుపోయిన బిల్డింగ్ వ్యర్థాలు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 1న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు..

మూసానగర్, కమల్‌నగర్, సర్దార్‌జీ బిల్డింగ్, గవర్నమెంట్ సిటీ మోడల్ స్కూల్, నయాగరా హోటల్, రెయిన్‌బజార్ చమన్, కార్నర్ టీ పాయింట్, గాంధీ కా దక్కన్ ఫంక్షన్‌హాల్, షాంబాగ్ ఫంక్షన్‌హాల్, కుమ్మరివాడి, జ్యోతీబాగ్, రజా నగర్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు..

ఎంఎంహెచ్ హాస్పిటల్, తిరుమల లైన్, డే బ్రేక్ వెనుక వైపు, రెయిన్‌బజార్, శ్రీనగర్ కాలనీ, నెహ్రూనగర్, రామచంద్రా నగర్, మస్కతి డెయిరీ ఫాం, కార్నర్ టీ పాయింట్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..

జెండా పీటీ, ఓల్డ్ మస్తాన్ గట్టీ, వాహీద్‌నగర్, ఏటుజెడ్, అఫారియా మజీద్, న్యూ వాహెద్‌నగర్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

నెహ్రూనగర్, మస్కతి పార్క్, రెయిన్‌బజార్ గ్రౌండ్, కార్నర్ టీ పాయింట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాట 27, వంకాయ 23, బెండ 38, పచ్చి మిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజి 16, ఫ్రెంచి బీన్స్ 125, క్యారెట్ 40, దొండ 18–23, చిక్కుడు 65, గోకర 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 55, ఆలు 31, దోస 23, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 27, చామగడ్డ 40.

గమనిక: ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

బీజేపీ దీక్షకు తరలిన నేతలు



మన్సూరాబాద్: ఫోన్‌ట్యాపింగ్ కేసు సూత్రధారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద శుక్రవారం నిర్వహించిన దీక్షకు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో నేతలు శుక్రవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో నేతలు పాతూరి శ్రీధర్‌గౌడ్, కడారి యాదగిరియాదవ్, రాజశేఖర్, సిద్ధు, కొండల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఘట్టుపల్లిలో హనుమాన్ జయంతి

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఉదయం 5 గంటలకు ఆలయంలో సుప్రభాతం, పంచామృతాభిషేకం, ఉదయం 7 గంటలకు నాగవల్లి పూజ (లక్ష తమలపాకులతో అర్చన), మధ్యాహ్నం ఒంటి గంటకు హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని తెలిపారు.